నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 15 జూలై 2024 | SIDDIPET

## పాండురంగ ఆశ్రమంలో అభిషేకాలు

మర్కూక్, జూలై 14: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం భవానందపూర్‌లోని పాండురంగస్వామి ఆశ్రమంలో ఆదివారం ఆషాఢ ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీసీతారామచంద్రస్వామికి పురుషసూక్త అభిషేకాలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి బైక్‌లపై ర్యాలీగా తరలివచ్చిన భక్తులు హరే రామ భక్తిసంకీర్తనలో పాల్గొన్నారు. హైదరాబాద్ గౌలిగూడకు చెందిన శ్రీగురుదత్తా భజనమండలి సభ్యులు పెద్ద ఎత్తున భజనలు,కీర్తనలు చేసి స్వామిసేవలో తరించారు.


సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం భవానందపూర్‌లోని పాండురంగ ఆశ్రమానికి బైక్‌లపై ర్యాలీ వెళ్తున్న భక్తులు


సంగారెడ్డిలో అసంపూర్తిగా నిలిచి పోయిన గృహకల్ప సముదాయం పనులు

## సరస్వతి కృషి మరువలేనిది

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లిలో మెరుపుల సరస్వతి విగ్రహావిష్కరణ

సిద్దిపేట, జూలై 14 : తెలంగాణ సాధన కోసం మాజీ ఎంపీపీ మెరుపుల సరస్వతి కృషి మరువలేనిదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లిలో మాజీ ఎంపీపీ మెరుపుల సరస్వతి విగ్రహాన్ని ఆమె భర్త మెరుపుల నారాగౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. మెరుపుల సరస్వతి 23 ఏండ్లు ప్రజాసేవ చేశారన్నారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సందర్భంలో ఆనాటి ప్రభుత్వాలు ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా లొంగకుండా మెరుపుల సరస్వతి, నారాగౌడ్ ఉద్యమంలో పనిచేశారని గుర్తుచేశారు. సరస్వతి గ్రామానికి వచ్చిన సందర్భంలో రోడ్లు, ఇతర సమస్యలపై ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువచ్చి గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు. నేడు సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. పుట్టిన ప్రతి వ్యక్తి మరణిస్తారని, వారు చేసిన మంచి పనులే చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతాయన్నారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తుపాకుల బాల్‌రంగం, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సీనియర్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పల్ సాయిరామ్, గుండు భూపేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర యా దయ్య, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ భూమయ్య గారి కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రఘోత్తంరెడ్డి, నాయకుడు పూల బాలకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట జిల్లా చిన్నగుండవెల్లిలో మాజీ ఎంపీపీ మెరుపుల సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## గృహకల్ప ఫ్లాట్లకు మోక్షమెప్పుడో..!

- పేదోడి సొంతింటి కల సాకారం అయ్యేనా..
- లబ్ధిదారుడి వాటాగా రూ.49వేల చొప్పున చెల్లింపు
- సంగారెడ్డి జిల్లాకేంద్రంలో వాటాధనం చెల్లించిన 240 మంది
- రూ.708.48 కోట్లను కేటాయించిన ప్రభుత్వం
- ఏండ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు కేటాయించని ఫ్లాట్స్
- అసంపూర్తి నిర్మాణాలతో అడవిని తలపిస్తున్న సముదాయం
- జిల్లా మంత్రి చొరవ చూపాలని పేదల విజ్ఞప్తి

సంగారెడ్డి, జూలై 14: పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు సంగారెడ్డి పట్టణంలో 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన గృహకల్ప ఫ్లాట్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. సంగారెడ్డి పట్టణంలో ఇండ్లు లేని పేదలకు ఇండ్లను కట్టించి ఇచ్చేందుకు అప్పట్లో గృహకల్పకు అడుగుల పడ్డాయి. ప్రభుత్వం పేదవారికి త్వరగా ఫ్లాట్లు అందించాలనే ఉద్దేశంతో రూ.708.48 కోట్ల నిధులు మంజూరు చేసింది. శాఖల వారీగా విభజించి నిర్మాణాలు మొదలుపెట్టారు.18 బ్లాకులుగా విభజన చేసి లబ్ధిదారుడి వాటా నిధులను ప్రభుత్వానికి చెల్లించారు. అందులో గృహనిర్మాణశాఖ అధికారుల పర్యవేక్షణలో 4బ్లాకులు 96 ఫ్లాట్లు, ఇంటేగ్రెల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 2 బ్లాకులు 48 ఫ్లాట్లు, స్టెర్లింగ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ 2 బ్లాకులు, తేజ ప్రాజెక్టు పరిధిలో 10 బ్లాకులు 240 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గృహకల్ప సముదాయాన్ని ఏకకాలంలో నిర్మించి లబ్ధిదారులందరికీ ఒకేసారి ఫ్లాట్లను కేటాయించాలని లక్ష్యంతో పనులు ప్రారంభించారు. తేజ ప్రాజెక్టు కంపెనీకి కేటాయించిన ఫ్లాట్లు ప్రభుత్వం ఆశించిన మేరకు పూర్తికాలేదు. దీంతో ఈ ప్రాజెక్టు చేపట్టిన ఫ్లాట్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయి. మిగతావి ఫ్లాట్లను అధికారులు లబ్ధిదారులకు సకాలంలో పూర్తిచేసి కేటాయించారు. తేజ ప్రాజెక్టు చేపట్టిన ఫ్లాట్లను సకాలంలో నిర్మించి లబ్ధిదారులకు కేటాయిస్తే వాటాధనం చెల్లించిన వారికి అద్దెల బాధ తప్పేది. ఇప్పటికీ అద్దె ఇండ్లల్లో ఉంటూ రాజీవ్ గృహకల్పలో తమకు ఫ్లాట్ వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. తాము చెల్లించిన వాటాధనాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేసి ఉంటే మూడింతలు అయ్యేవని, ఫ్లాట్ వస్తుందనే ఆశతో ఇప్పటికీ ఉన్నామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 240 ఫ్లాట్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తే ఒక వార్డుతో కొత్తగా ఏర్పాటు అవుతుంది. ఇన్నేండ్లనా తమకు ఫ్లాట్ రాకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకుని నిర్మాణాలు పూర్తిచేయించి తమకు ఫ్లాట్లు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### ఫ్లాట్ల వారీగా లబ్ధిదారుల వాటాధనం..

నాలుగు బ్లాకుల్లో 96 ఫ్లాట్లకు ఒక్కో లబ్ధిదారుడి వాటాగా రూ.28 వేలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు కలిపి రూ.1.33లక్షలు కాగా, మొత్తం రూ.127.68కోట్ల నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. 2 బ్లాకుల్లో 48 ఫ్లాట్లకు లబ్ధిదారుడి వాటాగా రూ.1.50 లక్షలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు కలిపి రూ.2.10 లక్షలు కాగా, మొత్తం రూ.100.8 కోట్లకు అనుమతిచ్చింది. స్టెర్లింగ్ కన్‌స్ట్రక్షన్ సిస్టంతో రెండు బ్లాకుల్లో లబ్ధిదారుడి వాటాగా రూ.1.25 లక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు రూ.2.30లక్షలు కాగా, మొత్తం రూ.110.40 కోట్లు, తేజ ప్రాజెక్టు చేపట్టిన 240 ఫ్లాట్ల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోవడంతో లబ్ధిదారులు తమకు ఫ్లాట్లు వస్తాయే..రావో అనే ఆందోళనలో ఉన్నారు. ఈ ఫ్లాట్ల లబ్ధిదారులు తమ వాటాధనం కింద రూ.49 వేల చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాధనంతో కలిపి రూ.1.54లక్షలు కాగా, మొత్తం రూ.369.6కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. 18 బ్లాకులకు గానూ 8 బ్లాకులు పూర్తిచేసి లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయించారు. మిగతా 10బ్లాకుల్లో నిర్మాణ దశలో ఉన్న ఫ్లాట్లను త్వరగా పూర్తిచేసి తమకు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

## టెన్త్ ఫలితాలు మనందరికీ గర్వకారణం

- ఉత్తమ ఫలితాలు పొందినప్పుడు కలిగే అనుభూతి గొప్పది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఐప్యాడ్లు అందజేత


సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సొంత డబ్బులతో విద్యార్థులకు ఐప్యాడ్లు అందజేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జూలై 14 : టెన్త్ ఫలితాలు మనందరికీ గర్వకారణమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పదోతరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన 75 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ఒక్కొక్కరికీ రూ.10వేల విలువైన ఐప్యాడ్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట పేరును విద్యార్థులు చరిత్ర పుటల్లో నిలిపారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడు కలిగే అనుభూతి ఎంతో గొప్పదన్నారు. పదో తరగతి ఫలితాలు వచ్చినప్పుడు తాను అమెరికాలో ఉన్నానని, అక్కడి నుంచి విద్యార్థుల తల్లిదండ్రులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి అభినందనలు తెలిపినట్లు గుర్తుచేశారు. సొంత ఖర్చులతో స్నాక్స్, డిజిటల్ పుస్తకాలు ఇచ్చినట్లు తెలిపారు. గతేడాది కంటే ఈసారి ఎక్కువ ఉత్తీర్ణతశాతం సాధించారని, సిద్దిపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, సిద్దిపేటకు పేరు తీసుకురావడంపై విద్యార్థులను అభినందించారు. బాసరట్రిపుల్ ఐటీలో 169 సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, సహకరించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా శర్మ, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, బాలకృష్ణ, మాజీ జడ్పీటీసీ తుపాకుల బాల్‌రంగం, నాయకులు సోమిరెడ్డి, కోల రమేశ్‌గౌడ్, ఎల్లారెడ్డి, మేర్గు మహేశ్, ఎంఈవో యాదవరెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- పోలీసులు జవాబుదారీగా పనిచేయాలి
- మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

అల్లాదుర్గం,పెద్దశంకరంపేట , రేగోడ్, జూలై14: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేట,అల్లాదుర్గం, రేగోడ్ పీఎస్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లలోని రికార్డులు, పట్టుబడిన వాహనాలను ఆయన పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు జవాబుదారీగా పనిచేస్తూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని పరిష్కరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రగ్స్,మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు నిరంతరం వాహనాల తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ రాజేశ్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, రేగోడ్ ఎస్సైలు ప్రవీణ్ రెడ్డి,శంకర్, రాజయ్య,ఏఎస్సై మల్లయ్య సిబ్బంది పాల్గొన్నారు.


అల్లాదుర్గం పీఎస్‌లో పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

## గుంతలమయంగా రోడ్డు

- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- రూ.1.52 కోట్లు మంజూరైనా ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు

న్యాల్‌కల్, జూలై 14: రహదారులు బాగుంటేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది. గ్రామాల్లో రోడ్డు, రవాణా సౌకర్యం మెరుగుపర్చడానికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేస్తోంది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని చాల్కి, చీకుర్తి, హుస్సేన్‌నగర్ మీదుగా కర్ణాటకకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అధ్వానంగా మారిన రోడ్డు మరమ్మతుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్టేట్ ఫండ్ కింద రూ.1.52 కోట్లు మంజూరు చేసింది. సం బంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆయా గ్రామాల మీదుగా వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు పనులు చేపట్టడం లేదు. రోడ్డుపై బీటీ కోతకు గురై గుంతలుపడి కంకర తేలింది. మోకాళ్లలోతు గోతులు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో రోడ్డు మార్గం గుండా వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రోడ్డు మరమ్మతుల కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా సంబంధిత అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని చాల్కి-చీకుర్తి గ్రామాల మధ్య అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

## ప్రాజెక్టుల నుంచి నీళ్లు విడుదల చేయాలి

- నీళ్లిచ్చి రైతులను కాపాడాలి
- కేసీఆర్ హయాంలో నిండుకుండలా కూడవెల్లి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సిద్దిపేట జిల్లా తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం


సిద్దిపేట జిల్లా తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభించి క్యాన్‌లో వాటర్ పడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, జూలై 14: ప్రాజెక్టుల నుంచి నీళ్లు విడుదల చేసి వర్షాభావ పరిస్థితుల నుంచి రైతులను కాపాడాలని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లిలో ఎమ్మె ల్యే సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, వాటర్ క్యాన్లు, చెత్తబుట్టలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌సర్కారు తెలంగాణ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. గులాబీ అధినేత కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీళ్లు ఉండేవని, కూడవెల్లివాగు నిండుకుండలా ప్రవహించేదన్నారు. రామయంపేట, దుబ్బాక ప్రధాన కాల్వల ద్వారా చెరువులు, కుంటల్లో నీళ్లు నింపడం జరిగిందని గుర్తుచేశారు. కేసీఆర్ మీద కక్షకట్టి కాళేశ్వరం ప్రాజెక్టు సాకుతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, నార్లుముదిరిపోతున్నా నాట్లు వేసే పరిస్థితులు లేవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కూడవెల్లి వాగుతో పాటు దుబ్బాక, రామయంపేట ప్రధాన కాల్వల ద్వారా నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను నింపాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మల్లన్నసాగర్,కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల కింద చెరువు,కుంటలకు పూర్తిస్థాయిలో నీళ్లు పారించడానికి కాల్వలు ఏర్పాటు చేయాలని కోరినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. కేసీఆర్ రైతుబంధు ద్వారా ఎకరాకు ఏడాదికి రూ.10 వేలు ఇస్తే రైతు భరోసా ద్వారా రూ.15 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇంతవరకు ఇవ్వడం లేదని ఆరోపించారు. పెట్టుబడుల సమయంలో ఇస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. నాడు రేవంత్‌రెడ్డి కోసం పనిచేసిన నిరుద్యోగులు నేడు నిజం తెలుసుకొని పోరాటం చేస్తున్నారన్నారు. అనంతరం ఇటీవల పిడుగుపాటు గుర్తై మరణించిన కడారి శ్రీశైలం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చా రు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బక్క కనకయ్య, మండల యూత్ అధ్యక్షుడు మాదాసు అరుణ్‌కుమార్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చిలువేరి రాజిరెడ్డి, తగరం ఆశోక్, చెరుకు లక్ష్మారెడ్డి, నాయకులు రమేశ్, మంగ నర్సింహులు, యాదగిరి, వెంకట్‌రెడ్డి, నందరామ్ నరేందర్‌గౌడ్, చిక్కుడు రమేశ్, స్వామిగౌడ్, రాములు, సూతారి రాంబాబు, యెన్నం కొండల్‌రెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.

## వర్షాల కోసం గ్రామ దేవతలకు జలాభిషేకం

మద్దూరు (ధూళిమిట్ట), జూలై 14 : సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్‌లో వర్షాల కోసం గ్రామస్తులు ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ఆడ మగ, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా బిందెల్లో నీళ్లు తీసుకొని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లి దేవతామూర్తులకు జలాభిషేకాన్ని నిర్వహించారు. కొన్ని రోజులుగా వర్షా లు లేక పంటలు ఎండిపోతున్నాయని, వర్షాలు లేకపోతే తాము బతుకేది కష్టమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


ధూళిమిట్ట మండలం కొండాపూర్‌లో జలాభిషేకాల కోసం ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

## కొమురవెల్లి క్షేత్రంలో భక్తుల సందడి

### దర్శించుకున్న హైకోర్టు జడ్జి, రాజ్యసభ ఎంపీ



కొమురవెల్లి మల్లన్నస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి శ్రవణ్‌కుమార్

చేర్యాల, జూలై 14 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఆదివారం సుమారు 10 వేల మంది భక్తులు దర్శించుకొన్నారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, సిబ్బంది, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు,ఒగ్గు పూజారులు, భక్తులకు సేవలందించారు. హైకోర్టు జడ్జి ఎన్వీ శ్రవణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. దేవాదాయశాఖ ఏసీ శివరాజ్ ఆధ్వర్యంలో అర్చకులు జడ్జికి స్వామివారి జ్ఞాపిక, ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీ పీ సతీశ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్సై రాజుగౌ డ్, ఆలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తన కుటుంబంతో కలిసి మల్లన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆయన అన్నారు. దేవాదాయ శాఖ ఏసీ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను ఎంపీకి అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు లింగంపల్లి కనకరాజు, మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, సార్ల లింగం, చంద్రం, శ్రీకాంత్, బాలయ్య, రమేశ్, చెరుకు రమణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, విష్ణుమూర్తి, రాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌వి నీచ రాజకీయాలు

### మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్, జూలై 14: బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు కండువాలు కప్పుతూ సీఎం రేవంత్‌రెడ్డి శునకానందం పొందుతున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతనం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రోజూ భారత రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నాడన్నారు. కేసులను అడ్డం పెట్టుకొని పనులు ఇస్తామనో, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటే వేదికల మీదికి పిలవమనో, ఎస్కార్టు ఇవ్వమనో, పోలీసులచే కేసులు పెట్టిస్తామనో భయపెట్టి చేస్తున్న నీచ రాజకీయాల ఫలితాలను నాలుగున్నర సంవత్సరాల తర్వాత రేవంత్‌రెడ్డి తప్పకుండా అనుభవిస్తాడన్నారు. పశువులను సంతలో కొంటున్నట్లు ఎమ్మెల్యేలను కొంటుంటే రాహుల్‌గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఎందుకు తెలంగాణ న్యాయమూర్తులు మౌనంగా ఉన్నారని, సుప్రీంకోర్టు జడ్జీలు మాట్లాడతలేరన్నారు. కార్యక్రమంలో నాయకుడు జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు